
నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య


ఆకట్టుకున్న త్రిముఖ వినాయకుడు


నిమజ్జనోత్సవంలో భక్తుల కోలాహలం..


హిందూపురంలో అశేష భక్త జనం మధ్య సాగుతున్న శోభాయాత్ర

# బై బై గణేశా

జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై .. గణపతి బొప్పా మోరియా అంటూ భక్తుల జయ జయ ధ్వానాలతో హిందూపురం వీధులన్నీ ప్రతిధ్వనించాయి. ఎటు చూసినా భక్తుల కోలాహలం... తప్పెట వాద్యాలు.. చెక్క భజనలు, బ్యాండు మేళాలు, భక్తి గీతాలాపనలు, యువకుల ఈలలు , కేరింతలే. చవితి రోజున కొలువుదీరిన ఆదిదేవుడు గణనాథుడికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. భక్తిశ్రద్ధలతో గంగమ్మ ఒడికి చేర్చారు.

- 'పురం'లో అత్యంత వైభవంగా వినాయక నిమజ్జనం
- భక్తులతో కిక్కిరిసిపోయిన పట్టణం
- డప్పు మోతలతో సందడే సందడి
- తెల్లవారే వరకూ సాగిన కార్యక్రమం
- నిమజ్జనోత్సవం ప్రశాంతంగా సాగడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు


డీజే హోరులో యువత కేరింత


బొజ్జ గణపయ్యను గుడ్డం కోనేరులో నిమజ్జనం చేస్తున్న దృశ్యం

**హిందూపురం:** బొజ్జ గణపతి.. సకల విద్యల విఘ్నేశ్వరుడు.. శివపార్వతుల ముద్దుల తనయుడు... ఆదిపూజలస్వామి... ఏకదంతుడైన వినాయకుడి నిమజ్జనం గురువారం హిందూపురం పట్టణంలో అత్యంత వైభవంగా జరిగింది. పట్టణంలో కొలువు దీరిన 138 వినాయక విగ్రహాలను గుడ్డం కోనేరులో నిమజ్జనం చేశారు.

**మధ్యాహ్నం 2 గంటల నుంచే..**

గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచే గణేశ్ మండపాల వద్ద కోలాహలం మొదలైంది. భారీ గణేశ్ విగ్రహాలను వాహనాల్లో కొలువుదీర్చి ప్రత్యేక పూజల తర్వాత శోభాయాత్రను ప్రారంభించారు. శుక్రవారం తెల్లవారుజాము వరకూ నిమజ్జనోత్సవం సాగింది. అంతకుముందు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొలువైన వినాయకుల ప్రతిమలను ట్రాక్టర్లు, లారీలపై ముస్తాబు చేసి అంబేడ్కర్ సర్కిల్‌కు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అటు నుంచి గాంధీసర్కిల్ గుండా విడి రోడ్డు మీదుగా పల్లా సర్కిల్ రైల్వేరోడ్డు నుంచి శ్రీనివాస మందిరం, రాజీవ్‌సర్కిల్‌ల గుండా ఎంజీఎం స్కూల్ నుంచి గుడ్డం కోనేరు చేర్చారు.

**సందడే సందడి..**

వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా హిందూపురంలో సందడి వాతావరణం నెలకొంది. డీజే మ్యూజిక్, మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాల మధ్య యువకుల నృత్యాలతో హోరెత్తించారు. వివిధ వేషధారణలతో యువకులు ఆకట్టుకున్నారు. అడుగడుగునా దాతలు నీరు, మజ్జిగ, ప్రసాదాలను భక్తులకు అందించారు.

**కట్టుదిట్టమైన బందోబస్తు..**

పురంలో గణేశ్ నిమజ్జనోత్సం సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ వి.రత్న, అదనపు ఎస్పీ, పర్యవేక్షణలో డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో బలగాలను మోహరించారు. పట్టణ ప్రధాన ప్రాంతాలతో పాటు గుడ్డం కోనేరు ఘాట్ వద్ద బందోబస్తులను పర్యవేక్షించారు. సీఐలు రాజగోపాల్‌నాయుడు, అబ్దుల్ కరీం, ఆంజనేయులు, జనార్దన్‌లతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు సిబ్బంది ఎలాంటి అవాంతరాలు లేకుండా నిమజ్జనోత్సవాన్ని పూర్తి చేయించారు.

**విద్యుత్తు అంతరాయంపై అసహనం..**

పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా తెల్లవారుజాము నుంచే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో పట్టణమంతా అంధకారం నెలకొంది. జనరేటర్లు, యూపీఎస్‌లు ఉన్న చోట తప్ప ఎక్కడా విద్యుత్ కాంతులు లేవు. గురువారం అర్ధరాత్రి వరకూ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలేకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



శోభాయాత్రలో వెయ్.. చిందెయ్..


కరెంటు పోయినా.. జనరేటర్ వెలుగుల మధ్యనే...


నిమజ్జనోత్సవంలో మహిళల నృత్యాలు


శోభాయాత్రలో ఓ భాగం


అన్నదానం చేస్తున్న ముస్లింలు


బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ రత్న

## న్యూస్‌రీల్

### సొసైటీలను తనిఖీ చేసిన కలెక్టర్


గూనిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

**పుట్టపర్తి అర్బన్:** యూరియా కొరత అధికం కావడంతో కలెక్టర్ చేతన్ పలు మండలాల్లోని సొసైటీలను తనిఖీ చేశారు. బుక్కపట్నం మండలం గూనిపల్లి, కొత్తచెరువు మండలం కేశాపురం, సోమందేపల్లి లోని సొసైటీలను తనిఖీ చేసి యూరియా స్టాక్‌పై వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరి సాగుకు అధిక నీటితో పాటు యూరియా అవసరం ఉంటుందని, ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువ నీటితో ఎక్కువ లాభాలు ఇచ్చే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. చిరుధాన్యాల సాగు, పండ్ల తోటలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను, సేంద్రియ ఎరువులను వినియోగించడంలో ముందుండాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చే వివిధ ప్రయోజనాలను ,సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీఓ ఆనంద్, డీసీఓ కృష్ణానాయక్, ఏఓ నటరాజ్, తహసీల్దార్ నరసింహులు, సీఈఓ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయులకు నేడు అవార్డుల ప్రదానం

**పుట్టపర్తి అర్బన్:** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. విద్యాబోధనలో ప్రతిభ కనబరచడంతో పాటు పాఠశాలను అభివృద్ధి చేసి సమసమాజస్థాపనకు కృషి చేసిన జిల్లాలోని 71 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేయనున్నారు. పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలోని మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు సన్మాన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొననున్నారు.

### ఏడుగురికి ఎంపీడీఓలుగా పదోన్నతి

**అనంతపురం సిటీ:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏడుగురికి ఎంపీడీఓలుగా పదోన్నతి దక్కింది. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న 156 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. జాబితాలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మొత్తం ఏడుగురు ఉన్నారు. ఏఓలు ఉమాదేవి (జెడ్పీ-అనంతపురం), జి.శ్రీనివాసులు (బత్తలపల్లి), జయరాములు(వజ్రకరూరు) ఎంపీడీఓగా పదోన్నతి పొందారు. డిప్యూటీ ఎంపీడీఓ క్యాడర్ నుంచి శకుంతల (నల్లచెరువు), మాధవి(డీపీఆర్‌సీ-అనంతపురం), ఆనంద్(రాప్తాడు), కమలాబాయ్(పెనుకొండ) ఉన్నారు.

**8 నుంచి శిక్షణ తరగతులు..**

ఎంపీడీఓలుగా పదోన్నతి పొందిన వారికి ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు శ్రీకాళహస్తిలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ శివశంకర్ గురువారం రాత్రి తెలిపారు. ఈ మేరకు వారందరికీ సమాచారం ఇచ్చామని వివరించారు.

### ఏడు రోజుల పోలీసు కస్టడీకి నిందితులు



**కదిరి అర్బన్:** మండలంలోని కొండమనాయునిపాళెం సమీపంలో గత నెల 22న గంజాయిని అక్రమ తరలిస్తూ పట్టుబడిన అజాజ్, షోయబ్‌ను ఏడు రోజుల పోలీసు కస్టడీకి న్యాయమూర్తి అనుమతించారు. ఈ కేసులో మరింత లోతుగా విచారణ చేయాల్సి ఉందని, నిందితులను పోలీస్ కస్టడీకి అప్పగించాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై అనంతపురం ఎన్‌డీపీఎస్ కోర్టు జడ్జి స్పందిస్తూ ఏడు రోజుల కస్టడీకి అనుమతించారు. ఈ మేరకు కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పీఎస్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

**రిమాండ్‌కు నిందితులు..:** కదిరి మండలం పట్నం గ్రామంలో ఈ నెల 1న జరిగిన హత్యాయత్నం కేసులో పరారీలో ఉన్న సూర్యనారాయణ, అతని కుమారులు అరవింద, నవీన్‌అశోక్, భార్య రమణమ్మ, కుమార్తె కీర్తనను అరెస్ట్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి కొడవలి, ఇనుపరాడ్ స్వాధీనం చేసుకుని న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

## ఈ-క్రాప్ ఆధారంగానే యూరియా

- కలెక్టర్ టీఎస్ చేతన్


యూరియా పంపిణీపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

**ప్రశాంతి నిలయం:** జిల్లాలో ఈ-క్రాప్ నమోదు ఆధారంగా టోకెన్ పద్ధతిలో యూరియా పంపిణీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో యూరియా మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఎంత మేరకు పంటలు సాగు చేశారు. పంటల జాబితా , వాటికి అవసరమయ్యే యూరియా మోతాదును డివిజన్, మండల, రైతు సేవా కేంద్రాల వారీగా నమోదు చేయాలన్నారు. పంటలు సాగు చేసి యూరియా అవసరమున్న రైతులకు మాత్రమే సరఫరా చేయాలని ఆదేశించారు. డివిజనల్ స్థాయిలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల స్థాయిలో తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పంటల వివరాల ఆధారంగా ఎరువుల పంపిణీపై సమీక్ష చేయాలని ఆదేశించారు. జిల్లాలో యూరియా కొరత లేదని, మార్క్‌ఫెడ్ నుంచి ఎప్పటికప్పుడు స్టాక్ రైతు సేవా కేంద్రాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేసి యూరియా నిల్వల్లో తేడాలుంటే వెంటనే కేసులను నమోదు చేయాలన్నారు.

**కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు..**

జిల్లాలో యూరియా సరఫరాపై పర్యవేక్షణకు పుట్టపర్తిలోని జిల్లా ట్రైనింగ్ సెంటర్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి సెల్ 9177768274, 9948224545 నంబర్లను సంప్రదించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి సూర్యనారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి రాము నాయక్, మార్క్‌ఫెడ్ డీఎం గీతా, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పేషీ నుంచి సబ్ రిజిస్ట్రార్‌కు నోటీసులు

- అక్రమ రిజిస్ట్రేషన్‌పై వివరణ ఇవ్వాలని ఆదేశం

**సాక్షి, పుట్టపర్తి:** అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారానికి సంబంధించి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ మంత్రి పేషీ నుంచి బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్‌కు మెమో జారీ అయింది. అందుకు సంబంధించిన వివరణ ఇవ్వాలని నోటీసులు అందాయి. వివరాల్లోకెళితే.. అధికారాన్ని అడ్డు పెట్టుకుని ప్రభుత్వ భూములు కాజేసి.. అక్రమంగా భవనాలు నిర్మించి.. దొంగ పట్టాలు సృష్టించి.. రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పుట్టపర్తి మండలం పెడపల్లి సర్పంచ్ మంగ్లీబాయి ఆగస్టు 21న కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. పిటిషన్‌ను పరిశీలించిన అధికారులు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు పంపించారు. పెడపల్లి రెవెన్యూ పొలం సర్వే నంబరు 148-2లో గిరిజన కర్మకాండకు ఇచ్చిన స్థలానికి కూటమి నాయకులు దొంగ పట్టాలు సృష్టిస్తే.. ఎలాంటి పరిశీలన లేకుండా బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ రామమోహన్ రిజిస్ట్రేషన్ చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే గ్రామంలో సర్వే నంబర్లు 148-1, 2, 157-1, 2 లపై కూడా విచారణ చేయాలని కోరారు. దీంతో మంత్రి పేషీ నుంచి బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్‌కు మెమో జారీ చేశారు. ఆయా సర్వే నంబర్లపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

**అది ప్రభుత్వ భూమే...**

ప్రభుత్వ భూముల కబ్జాపై ఇటీవల సాక్షి దినపత్రికలో 'కబ్జాల ఖల్ నాయక్' పేరుతో కథనం ప్రచురితమైంది. దీనిపై పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ.. అధికారులతో కలిసి గురువారం పెడపల్లి గ్రామానికి వెళ్లి పరిశీలించారు. అక్కడి గ్రామస్తులను సంప్రదించగా.. రోడ్డు పక్కన భవనం నిర్మించిన ప్రాంతం డిజిటల్ లైబ్రరీకి కేటాయించినదేనని తెలిపారు. భవనం కూల్చేయాలని కలెక్టర్ ఆదేశించినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రజలు ప్రశ్నించారు. అయితే భవనం కూల్చివేతపై జాప్యం ఎందుకని అనుమానం వ్యక్తం చేశారు. టీడీపీకి చెందిన ఓ మాజీ మంత్రి సూచనతోనే అక్రమ కట్టడాల కూల్చివేత ఆగుతున్నట్లు సమాచారం.

## బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ప్లాన్ గడువు పొడిగింపు

**అనంతపురం సిటీ:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఎస్ఎన్ఎల్ కేవలం ఒక్క రూపాయికే అమలులోకి తెచ్చిన ఫ్రీడమ్ ప్లాన్ గడువును మరో 15 రోజుల పాటు పొడిగించినట్లు ఆ శాఖ జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.




## యూరియా కొరతపై అన్నదాతల ఆగ్రహం

- 300 మందికి 140 బస్తాలు ఎలా సరిపోతాయని నిలదీత


నిడిమామిడిలో యూరియా కోసం ఆర్ఎస్‌కేను చుట్టుముట్టిన రైతులు

**పుట్టపర్తి అర్బన్:** జిల్లాలోని రైతులకు యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. పుట్టపర్తి మండలం గాజులపల్లి చెరువు కింద వరి సాగు చేసే రైతులు, నిడిమామిడి పంచాయతీ రైతులు సుమారు 300 మందికి కేవలం 140 బస్తాలే సరఫరా చేయడంతో యూరియా కోసం అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు నెల రోజుల నుంచి యూరియా లేక అల్లాడిపోతున్న రైతులకు ప్రభుత్వం నిడిమామిడి ఆర్ఎస్‌కేకు కేవలం 140 బస్తాలు సరఫరా చేయడంతో రెండు గంటల్లో స్టాక్ అయిపోయింది. తక్కిన రైతులు ఉసూరుమంటూ ప్రభుత్వంపై, వ్యవసాయాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తిరుగు ముఖం పట్టారు. చేతగాని ప్రభుత్వం అంటూ నిప్పులు చెరిగారు. పుట్టపర్తి మండలం నిడిమామిడి పంచాయతీలో 7 గ్రామాలు ఉన్నాయి. పక్కనే మరో మూడు పంచాయతీలు కొట్లపల్లి, ఇరగరాజుపల్లి, రాచువారిపల్లి ఉన్నాయి. సుమారు 1000 ఎకరాల్లో వరి సాగు చేశారు. మొక్కజొన్న సాగు చేస్తున్నారు. వీరికి మొదటిసారి కేవలం 140 బస్తాలు యూరియా రావడంతో రైతులంతా ఉదయం నుంచే వేచి ఉన్నారు. యూరియా పంపిణీ ప్రారంభమైన కొద్ది సేపటికే స్టాక్ అయిపోయిందని చెప్పడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. యూరియా కోసం ఆందోళన చేశారు. మూకుమ్మడిగా ఆర్ఎస్‌కేలోకి చొచ్చుకెళ్లినా ఫలితం లేకపోయింది.

# ఆదర్శం.. స్ఫూర్తిదాయకం



తల్లిలా ఆదరిస్తారు. తండ్రిలా బుద్ధి చెబుతారు. బెత్తంతో బెదిరించినా.. ప్రేమతో పలకరించినా శిష్యుల ఉన్నతి కోసమే.. అజ్ఞానమనే అంధకారాన్ని పారదోలేందుకే.. అందుకే యుగాలు మారినా.. కాలాలు మారినా.. ప్రాంతాలు మారినా వారి స్థానం మాత్రం పదిలంగా ఉంటోంది. తల్లి, తండ్రి తర్వాత అంతగా కీర్తి దక్కించుకున్న గురువుల ప్రాధాన్యత చెప్పడానికి మాటలు సరిపోవేమో! అందుకే "ఈ ప్రపంచంలో కొన్ని వందల వృత్తులు ఉన్నా వారందరినీ తయారు చేసే వృత్తి ఉపాధ్యాయ వృత్తే.. అందుకే ఆ వృత్తి అంటే నాకు ఎంతో గౌరవం' అన్నారు గొప్ప ఆచార్యునిగా ప్రసిద్ధి చెందిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఆ మహనీయుని జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటారు. ఎంతోమంది టీచర్లు ఉన్నా వినూత్న బోధనతో తమకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంటున్న పలువురు ఉపాధ్యాయుల స్ఫూర్తివంతమైన ప్రయాణంపై ప్రత్యేక కథనం.

## నిబద్ధతకు ప్రతిరూపంగా..



బొమ్మల గేయదాన్ని నేర్పిస్తున్న టీచర్ రాధిక

మడకశిర రూరల్: మండలంలోని ఛత్రం ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయురాలు రాధిక... గుణాత్మకమైన విద్య బోధనతో విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేస్తున్నారు. నిబద్ధతకు ప్రతిరూపంగా నిలుస్తూ పనివేళలకు ముందే పాఠశాలకు చేరుకుంటారు. గ్రామస్తుల్లో చైతన్యం తీసుకువచ్చి పిల్లలను సక్రమంగా పాఠశాలకు పంపేలా చొరవ తీసుకున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారిలోని సృజనకు మెరుగులు దిద్దుతున్నారు.

## పాఠశాల అభివృద్ధిలో తనవంతుగా..





కొడపగానిపల్లిలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేయించిన వాటర్ ఫిల్టర్ (ఇన్‌సెట్) చంద్రబాబు

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరు జెడ్పీహెచ్ఎస్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చంద్రమౌళి.. పాఠశాల అభివృద్ధిలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. 2019లో పదోన్నతిపై వచ్చిన ఆయన ప్రధానంగా బాలికలు ఎదుర్కొంటున్న చెప్పుకోలేని సమస్యను గుర్తించి, నెదర్లాండ్‌కు చెందిన లిజియా ఫౌండేషన్ సహకారంతో రూ.1.50 లక్షల వ్యయంతో మరుగుదొడ్లను నిర్మించేలా చొరవ తీసుకున్నారు. అలాగే తరగతి గదిలో అరలు, బల్లలు, గ్రంథాలయంలో వసతులు సమకూర్చారు. రూ.50 వేలతో పాఠశాల అవసరాల కోసం రెండు కంప్యూటర్లను ఏర్పాటు చేయించారు. లిజియా ఫౌండేషన్ సహకారంతో రూ.1.50 లక్షలు వెచ్చించి పీహెచ్‌సీలో మరమ్మతు పనులు, వసతులు కల్పించి సమాజం పట్ల తన బాధ్యతను చాటుకున్నారు. నాగళూరులోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన పనిచేస్తున్న సమయంలో పుట్టపర్తికి చెందిన దాతలు సుందరవల్లి, సురేష్ సహకారంతో రోజు విద్యార్థులకు ఉదయం అల్పాహారాన్ని అందించేవారు.

## సేవలో ఆదర్శం...



వినూత్న పద్ధతిలో విద్యాబోధన చేస్తున్న కృష్ణవేణి

కదిరి అర్బన్: మండలంలోని కాళసముద్రం ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న కృష్ణవేణి క్యాన్సర్‌తో బాధపడుతూ ప్రతి నెలా తిరుపతిలోని స్విమ్స్‌లో కిమోథెరఫీ చేయించుకుంటున్నారు. భర్త హరిమోహన్ ఆర్టీసీలో అసిస్టెండ్ డిపో మేనేజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఓ వైపు అనారోగ్యం వెన్నాడుతూ ఉన్నా.. మొక్కవోని దీక్షతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కృష్ణవేణి పరితపిస్తున్నారు. తన జీతంతో పాఠశాల విద్యార్థుల ఎన్నో అవసరాలు తీర్చారు. ప్లేట్లు, గ్లాసు, బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు, ఇలా విద్యా సామగ్రిని తన సొంత డబ్బుతోనే కొనిస్తున్నారు. ప్రతి శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలకు పదును పెడుతూ వివిధ రకాల కృత్యాలను చేయిస్తుంటారు. గతంలో ఆమె బూగురుపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేశారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కాళసముద్రం ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చారు.

## వృత్తికే వన్నె..



పెనుకొండ: రొద్దం మండలం కోగిర జెడ్పీ హెచ్ఎస్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పెనుకొండ నివాసి జాబిలి చాంద్‌బాషా నిస్వార్థ సేవకుడిగా ఖ్యాతిగాంచారు. సమాజంపై విద్యార్థులను చైతన్య పరుస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా చేస్తున్నారు. మత సామరస్య కార్యక్రమాల్లో నిస్వార్థంగా పని చేస్తూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారు. సమాజంలోని రుగ్మతలు తొలగించడంలో ఓ కవిగా చాంద్‌బాషా రాణించారు.

## తన సబ్జెక్టే ఇంటి పేరుగా..



గరిశలపల్లి పాఠశాలలో విద్యా బోధన చేస్తున్న బీఏ తిమ్మప్ప

బత్తలపల్లి: మండలంలోని గరిశలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న బేల్దారి అంజినప్ప గారి తిమ్మప్ప అంటే గతంలో ఆయన పనిచేసిన మడకశిరలో ఎవరూ గుర్తు పట్టరు. ఎందుకంటే ఆ ప్రాంతంలో ఆయన పనిచేస్తున్న సమయంలో తన సబ్జెక్ట్‌లో విద్యార్థులు ఎవరూ వెనుకబడకుండా చూపిన శ్రద్ధనే కారణం. అందుకే ఆయన బోధించే సబ్జెక్ట్‌నే ఆయన ఇంటి పేరుగా ఆ ప్రాంత వాసులు మార్చేశారు. దీంతో తిమ్మప్ప కాస్త ఇంగ్లిష్ తిమ్మప్పగా ఆయన ఖ్యాతి గాంచారు. తాను పనిచేసిన ప్రతి పాఠశాలలోనూ విద్యార్థుల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఫలితంగా పలుమార్లు ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకున్నారు.

## తిరుగులేని విజయాలు



తల్లిదండ్రులకు నచ్చచెప్పి విద్యార్థిని తిరిగి బడిలో చేరేలా ఒప్పిస్తున్న హెచ్ఎం రాంప్రసాద్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: ప్రైవేటు పాఠశాలలకు స్థానిక సంజయ్‌నగర్‌లోనున్న బీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ తీర్చిదిద్దారు. ఆయన కృషి ఫలితంగా ఏటా పదో తరగతి ఫలితాల్లో బీఎస్ఆర్ విద్యార్థులు టౌన్‌ఫస్ట్‌గా నిలుస్తూ వస్తున్నారు. ఇలా ఒకటి రెండు సారు కాదు.. ఇప్పటి వరకూ వరుసగా ఐదు పర్యాయాలు ఈ పాఠశాల విద్యార్థులే టౌన్ ఫస్ట్‌గా నిలిచారు. అంతేకాక చదువు మానేసిన వారి ఇళ్లకు వెళ్లి పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులకు సర్దిచెప్పి మరీ పాఠశాలలో చేర్పించేవారు. పదో తరగతి పరీక్షల సమయంలో విద్యార్థులు రాత్రి పూట చదువుకుంటున్నారా లేదా అని వారి ఇళ్లకు వెళ్లి మరీ పరిశీలించేవారు. ఆయన కృషి ఫలితంగా బీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పిల్లలను చేర్చేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు పోటీ పడేవారు. దీంతో తమ పాఠశాలలో సీట్లు లేవు అని బోర్డు తగిలించాల్సి వచ్చేది. ప్రస్తుతం హెచ్ఎం రాంప్రసాద్ కొత్తపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు.

## ప్రభుత్వ బడిలో చేరేలా...



మూర్తిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న లావణ్య

కదిరి అర్బన్: గతంలో కదిరి మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయురాలు లావణ్య తనదైన శైలిలో విద్యాబోధన సాగిస్తూ 54 మంది ఉన్న ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 184కు చేరేలా చేశారు. విద్యా ఉపకరణాలను తన సొంత డబ్బుతో కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేస్తూ వారిని చదువులపై దృష్టి సారించేలా చేశారు. ఈ క్రమంలో పాఠశాల వేళలు ముగిసిన తర్వాత ఇళ్ల వద్ద సాయంత్రం విద్యార్థులు చదువుకుంటుండడం గమనించిన ధనవంతులు సైతం ఆకర్షితులై తమ పిల్లలను అదే పాఠశాలలో చేర్పిస్తూ వచ్చారు. ఆమె సేవలకు గుర్తుగా 2017లో బెస్ట్ టీచర్ అవార్డును రోటరీ క్లబ్ ప్రదానం చేసింది. 2024లో ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును ఎస్టీయూ అందజేసింది. ప్రస్తుతం సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె మూర్తిపల్లి ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు.

## క్లుప్తంగా

### తనిఖీల భయం... ఎరువుల దుకాణాలకు మూత



మూతపడిన దుకాణం ఎదుట పడిగాపులు కాస్తున్న రైతులు

ధర్మవరం రూరల్: తనిఖీ చేయడానికి విజిలెన్స్ అధికారులు వస్తున్న సమాచారంతో ధర్మవరం పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం నిర్వాహకులు మూతేశారు. తనిఖీ అధికారుల్లోని కింద స్థాయి సిబ్బంది ముందుగా సమాచారం ఇవ్వడంతో అందరూ జాగ్రత పడ్డారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి ఎరువులు, పురుగు మందులను కొనుగోలు చేయడానికి వచ్చిన రైతులు మూత పడిన దుకాణాలను చూసి గంటల తరబడి ఎదురు చూశారు. అసలే యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో కనీసం కాంప్లెక్స్ ఎరువులైన తీసుకెళ్లదామని వస్తే దుకాణాలు మూతేయడంతో అసహనానికి గురయ్యారు. దుకాణాల్లో అక్రమ నిల్వలు, నకిలీ మందులు లేకుంటే ఎందుకు మూతేస్తారని, నిజాయితీగా వ్యాపారం సాగించకుండా ఇంత కాలం మోసగిస్తూ వచ్చారంటూ మండిపడ్డారు.

### జాతీయ అవార్డు గ్రహీతకు కలెక్టర్ అభినందన



నాగరాజును అభినందిస్తున్న కలెక్టర్ చేతన్

ధర్మవరం: చేనేత డిజైన్ డెవలప్‌మెంట్‌లో జాతీయ స్థాయి అవార్డు అందుకున్న ధర్మవరం పట్టణానికి చెందిన జుజారె నాగరాజును కలెక్టర్ టీఎస్ చేతన్ గురువారం తన చాంబర్‌లో అభినందించారు. అవార్డు కింద కేంద్ర ప్రభుత్వం అందజేసిన తామ్ర పత్రం, సర్టిఫికెట్లను పరిశీలించారు. కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్ ఏడీ రామకృష్ణ, ఏపీసీఓ మేనేజర్ సుబ్బారావు పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనాల ఢీ..

- వ్యక్తి మృతి

కదిరి టౌన్: స్థానిక మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల వద్ద గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముదిగుబ్బ మండలం నాగులగుబ్బ గ్రామానికి చెందిన రామాంజనేయులు(40) మృతి చెందాడు. ఈ మేరకు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. గాండ్లపెంటలో ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా స్థానిక పులివెందుల క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. తలకు రక్తగాయాలైన రామాంజనేయులును స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు రమణప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహనదారుడు, కదిరికి చెందిన పాజన్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

హిందూపురం టౌన్: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గురువారం చేపట్టిన తనిఖీల్లో 252 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం పట్టుబడింది. నాలుగు కేసులు నమోదు చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య వెల్లడించారు. హిందూపురంలోని చిన్నమార్కెట్ సమీపంలో ఓ వ్యక్తి నుంచి 48 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు, రహమత్‌పురం సర్కిల్‌లో వ్యక్తి వద్ద 8 ప్యాకెట్లు, పరిగి మండలం అక్కంపల్లి వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఒక్కొక్కరి వద్ద 96 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

## తాగుడు మానేయాలంటూ భర్తపై దాడి



భార్య దాడిలో గాయపడిన ఓబులేసు

ఉరవకొండ రూరల్: పదేపదే ప్రాధేయపడిన తాగుడు మానేయకపోవడంతో అసహనానికి లోనైన వివాహిత తన భర్తపై కట్టెతో దాడి చేసింది. వివరాలు.. ఉరవకొండ మండలం చిన్నముష్టూరు గ్రామానికి చెందిన ఓబులేసు, ఉలిగమ్మ దంపతులు. కూలి పనులతో జీవనం సాగించేవారు. ఈ క్రమంలో భర్త తాగుడుకు బానిసై కూలి పనులు చేయకుండా నిత్యమూ మద్యం మత్తులో జోగేవాడు. తాగుడుకు డబ్బు ఇవ్వాలంటూ తరచూ భార్యతో గొడవ పడేవాడు. తాగుడు మానాలని భార్య పలుమార్లు ప్రాధేయపడింది. అయినా ఓబులేసులో మార్పు రాలేదు. గురువారం ఉదయం మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న ఓబులేసును మరోసారి భార్య మందలించింది. తాగుడు మానేసి బుద్ధిగా తనతో పాటు కూలి పనులకు రావాలని హితవు పలికింది. ఆమె మాటలతో ఏకీభవించని ఓబులేసు వాగ్వాదానికి దిగాడు. దీంతో అసహనానికి గురైన ఉలిగమ్మ చేతికి అందుబాటులో ఉన్న కట్టె తీసుకుని భర్తపై దాడి చేసింది. అనంతరం స్థానికులతో కలసి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లింది. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## కర్ణాటక సరిహద్దున దారుణ హత్య



ముత్తప్ప (ఫైల్)

ఓడీచెరువు (అమడగూరు): కర్ణాటక సరిహదులోని అమడగూరు మండలం ఆకులోల్లపల్లి సమీపంలో కర్ణాటకలోని బిల్లూరు పంచాయతీ దేవరంక గ్రామానికి ముత్తప్ప (47) దారుణ హత్యకు గురయ్యాడు. సమీప బంధువులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని చింతామణికి చెందిన శ్రీనివాసరెడ్డి, దేవరంక గ్రామానికి చెందిన ముత్తప్ప రెండేళ్లుగా భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం 12 ఎకరాల్లో టమాట సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో లలరోజా సొంతూరు నుంచి కూలీలను తీసుకెళ్లి పనులు చేయించేవారు. బుధవారం సాయంత్రం టమాటలు లోడ్ చేయించి మార్కెట్‌కు తరలించిన అనంతరం ముత్తప్ప స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. అమడగూరు మండలం ఆకులోల్లపల్లి సమీపంలో వంకలోకి చేరుకోగానే గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేయడంతో అక్కడికక్కడే హతమయ్యాడు. సమాచారం అందుకున్న పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి, ఓడీచెరువు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణులు గురువారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. తలపై 2 కత్తిపోట్లు, గొంతు ఎడమ వైపు బలమైన గాయాలను గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. హతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



బత్తలపల్లిలోని మన గ్రోమోర్‌లో తనిఖీ చేస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్, ఏఓ

బత్తలపల్లి: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మవరం ఆర్డీఓ మహేష్ ఎరువుల దుకాణదారులను హెచ్చరించారు. గురువారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఎరువుల దుకాణాల్లో తహసీల్దార్ స్వర్ణలత, వ్యవసాయాధికారి ఓబిరెడ్డితో కలిసి తనిఖీలు నిర్వహించారు. మన గ్రోమోర్, మంజునాథ్ ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్, స్టాక్‌ను తనిఖీలు చేశారు. రికార్డుల ప్రకారం బత్తలపల్లి మండలంలో రైతులకు 13 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. కావాల్సిన రైతులకు రెండు బ్యాగులు చొప్పున విక్రయించాలని సూచించారు. రెండు, మూడు రోజుల్లో రైతు సేవా కేంద్రాలకు కూడా యూరియా సరఫరా అవుతుందన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## ఆంధ్రా ప్రెసిడెంట్, మధ్యప్రదేశ్ జట్ల విజయం



మ్యాచ్ జరుగుతున్న దృశ్యం

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-19 టోర్నీలో భాగంగా గురువారం అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగిన రెండు మ్యాచుల్లో ఆంధ్రా ప్రెసిడెంట్, మధ్యప్రదేశ్ జట్లు విజయం సాధించాయి. తొలుత ఆంధ్రా ప్రెసిడెంట్, ఆంధ్రా సెక్రెటరీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రా ప్రెసిడెంట్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంపిక చేసుకుంది. 49.1 ఓవర్లలో 232 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్రా సెక్రెటరీ జట్టు కేవలం 30.4 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం మధ్యప్రదేశ్, బరోడా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బరోడా బ్యాటింగ్ ఎంపిక చేసుకుంది. 45.4 ఓవర్ల వద్ద 178 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన మధ్యప్రదేశ్ జట్టు 45.4 ఓవర్లలో 182 పరుగుల సాధించి విజయాన్ని కైవసం చేసుకుంది.

## ఏపీఐఐసీతో భూమి కొనుగోలు ఒప్పందం

ప్రశాంతి నిలయం: ఆగ్నేయస్త్రా యూనిజెర్టిక్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు తమ పారిశ్రామిక అవసరాల కోసం మడకశిర మండలం ఆర్.అనంతపురం, గొడెనహళ్లి గ్రామాలలో ఏపీఐఐసీతో భూమి కొనుగోలు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగకుమార్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. భూమి పొజిషన్ పొందిన వెంటనే పరిశ్రమల ఏర్పాటు పనులు చేపట్టనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారన్నారు.

## ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితులకు రిమాండ్

బుక్కరాయసముద్రం: మైనర్ బాలుడిని ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పుల్లయ్య తెలిపారు. బీకేఎస్ మండలం కొట్టాలపల్లిలో ఓ బాలుడు 2022, ఏప్రిల్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాలుడి తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు నలుగురు యువకులపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. పాత కేసులు త్వరగా పూర్తి చేయాలన్న ఎస్పీ ఆదేశాల మేరకు.. బాలుడు ఆత్మహత్య కేసులో లోతైన విచారణ అనంతరం నలుగురు యువకులను అరెస్ట్ చేసి గురువారం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

## టీ తాగి వచ్చే లోపు నగదు అపహరణ

రాయదుర్గం టౌన్: స్థానిక లక్ష్మీబజార్‌లోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సమీపంలోని ఓ టీ కొట్టు వద్ద నిలిపిన ద్విచక్రవాహనం సైడ్ బ్యాగ్‌లోని నగదును దుండగుడు అపహరించుకెళ్లాడు. వివరాలు.. గుమ్మఘట్ట మండలం జె.వెంకటంపల్లికి చెందిన వడ్డే కుళ్లాయప్ప వ్యక్తిగత అవసరాల నిమిత్తం గురువారం మధ్యాహ్నం ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.1.70 లక్షలు నగదు తీసుకున్నాడు. అనంతరం నగదును తన ద్విచక్ర వాహనం సైడ్ బ్యాగ్‌లో ఉంచుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన ఆయన లక్ష్మీబజార్‌లోని టీ కొట్టు వద్ద ఆపి టీ తాగి వచ్చేలోపు నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

## ఆధ్యాత్మిక ధామం .. ఓనం వైభవం



మంగళ వాయిద్యాలతో నీరాజనం సమర్పిస్తున్న దృశ్యం



సత్యసాయిని కీర్తిస్తూ గానం చేస్తున్న భక్తులు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న కావ్య అజిత్ బృందం

ప్రశాంతి నిలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన ప్రశాంతి నిలయంలో ఓనం పర్వదిన వేడుకలు రెండో రోజు గురువారం ఘనంగా జరిగాయి. వేడుకలను పురస్కరించుకుని ఉదయం కేరళ సత్యసాయి భక్తులు ఓనం విశిష్టతను చాటుతూ చక్కటి భక్తిగీతాలు ఆలపిస్తూ చేసిన సంగీత కచేరీతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది. సాయంత్రం వేడుకల్లో భాగంగా ప్రముఖ సంగీత విద్వాంసురాలు కావ్య అజిత్ బృందం చక్కటి స్వరాలొలికిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ పాల్గొని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. భక్తులనుద్దేశించి ప్రసంగించారు. సత్యసాయి సేవలను కొనియాడారు. సత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు.